


# అర్ధరాత్రి ఆడది...

**-బాలాదేవి**

**అది 1960వ సంవత్సరం.**

చూడ్డానికి పెద్ద పెద్ద కాటుక కళ్లతో, నల్లని బారెడు జడతో, జడలో మల్లెపూల సువాసనలతో, తెల్లగా మెరుస్తూ పరికిణీ, ఓణి జాకెట్‌లో వున్న అచ్చ తెలుగు అమ్మాయి ఆ పిల్ల. ఆమె పేరు భవాని. ఇద్దరు తమ్ముళ్లు, రమణ, రవిలతో స్టేషన్‌లో ప్లాట్‌ఫారంమీద కూర్చుందామె రైలు రాకకోసం ఎదురుచూస్తూ. రైలు రావడానికి ఇంకా సమయం ఉంది. కానీ ఎప్పుడు వస్తుందో? జనం అంతగా లేరు. చిన్న స్టేషనది. పశ్చిమ ఒరిస్సాలో ఉన్న వాటిలో శంబర్‌పర్ పెద్ద ఊరే. ట్రంకు పెట్టెమీద భవాని, ఆమెకి రెండు పక్కలా కామిక్ పుస్తకాలేవో పట్టుకుని రమణ, రవి చదువుకుంటున్నారు.

భవాని తండ్రి నారాయణమూర్తి అంతకుముందే కొన్ని క్షణాలముందు పిల్లలని స్టేషన్‌లో అన్ని జాగ్రత్తలూ చెప్పి మరీ దింపి వెళ్లాడు. తను బిడివోగా పని చేస్తున్న ఊరికి మరోగంటయినా పడ్తుంది వెనక్కి వెళ్లడానికి. అందుకని రైలు రాకముందే జీపులో వెళ్లిపోయాడతను. ఆ రోజు ఆఫీసు పని ముగించి డాక్ బంగళా నుంచి పిల్లల్ని భోజనాలు పెట్టించి తసీకువచ్చాడు స్టేషన్‌కి. ఆడపిల్లలయినా, మగపిల్లలయినా చదువుకుని తమంత తాము స్వతంత్రంగా జీవించగలగాలని, ఎక్కడికయినా ఒక్కళ్లూ వెళ్లగలగలగాలని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, తమ నిర్ణయాలు తామే తీసుకోవాలని ఆశించి పిల్లలని అలాగే పెంచాలనుకునే ఆదర్శ వ్యక్తి అతను. అత్తగారు, మామగారు, తన తల్లి పిల్లల్ని వదిలి ఉండలేక భార్య రుక్మిణి, తన స్నేహితులు ఎందరో బంధువులు, అంత దూరంలో పెట్టి చదివించడం ఏమిటని

అన్నా వినకుండా తనున్న పల్లెటూరిలో చదువులు సరిగ్గా సాగవని, అందులోనూ తనకి ప్రతి రెండేళ్లకి బదిలీలు అయిపోతూ ఉండడంతో పిల్లల్ని తన అన్నగారి దగ్గర సామర్లకోటలో పెట్టాడు చదువులకని. వేసవి సెలవులు అయిపోయి స్కూళ్లు తెరుస్తున్నారు. కలెక్టర్ ఇన్‌స్పెక్షన్లువల్ల సెలవు దొరక్క పిల్లల్ని ఒక్కళ్లనీ పంపక తప్పలేదు అతనికి.

వాళ్లకి ఎదురుగా కొంతమంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. అందులో ఒకతను నల్లగా, లావుగా, పొట్టిగా, కొంచెం బట్టతలతో తమనే ఉండి ఉండి చూడడం భవాని గమనించకపోలేదు. ఆమె మనసులో కొంచెం బెదురు, భయం కలిగింది. హఠాత్తుగా కొద్దిసేపట్లో అతను క్రింద నున్న ఎయిర్‌బ్యాగ్ భుజాన వేసుకుని నడవడం మొదలుపెట్టాడు. ఎక్కడికో వెళ్లిపోతాడనుకున్న భవానికి ఊహకి విరుద్ధంగా అతను వాళ్లవేపు రావడం మొదలుపెట్టాడు. భవాని మరో వైపు తిరిగి దూరంగా మరెవరో కుటుంబంవైపుచూస్తూ కూర్చుంది ఏమీ ఎరగనట్లుగా.

అను దగ్గరగా వచ్చినట్లు అనిపించి ప్రక్కకు తిరిగింది భవాని. దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"నా పేరు విశ్వనాథం. మీరు తెలుగువాళ్లా?"

విశ్వనాథం తెలుగు మాట్లాడగానే భవానికి భయం తగ్గింది. కానీ ఆమె జవాబు చెప్పకముందే మరి కంచెం దగ్గరగా వచ్చి బేగు కింద పెట్టి అన్నాడు మళ్లీ "మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది. ఇటు పక్క పరికిణీ ఓణీల అమ్మాయిలు కనిపించరుకదా. ఈ అబ్బాయిలు మీ తమ్ముళ్లా?"

"అవును" అంది ముక్తసరిగా. మగపిల్లలిద్దరూ అతన్నోసారి చూసి మళ్లీ తమ పుస్తకాలలో మునిగిపోయారు. భవాని ఆ వ్యక్తితో మాట్లాడడానికి అంత ఉత్సుకత చూపించలేదు.

అయినా అతను సంభాషణకి ఉపక్రమించాడు. "ఏ ఊరు మీది? ఎక్కడికి వెళ్తున్నారు?" ఆమె నుంచి జవాబు రాకముందే అటుపక్కగా వెళ్తున్న చాయ్ కుర్రవాడికి నాలుగు టీలు చెప్పాడు.

భవానీ కంగారుగా అంది "మేమెవరం టీలు తాగము. ఇంకా స్కూల్‌లో చదువుకుంటున్నాము" కొంచెం అమాయకత్వం, బెదురు ఉన్నాయి ఆమె కంఠంలో. విశ్వనాథం తన మటుకే టీ తీసుకుని అన్నాడు "మీరొక్కరే వెళ్తున్నారా?" దానికి భవాని జవాబు చెప్పకపోవడంతో అతనే అన్నాడు మళ్లీ "అదేమిటి... మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని భయపడుతున్నారా? ఫర్వాలేదు. నేను రాజమండ్రి వెళ్తున్నాను. వ్యాపారం పనిమీద వచ్చానిక్కడికి. మీకేదైనా సాయం కావాలంటే చెప్పండి."

అంతలో రైలు వస్తున్న సందడి రావడంతో మరి జవాబు చెప్పనక్కర్లేదని భవాని మనసులోనే దేవుడికి దండం పెట్టుకుంది. రైలు ప్లాట్‌ఫారంమీదకి చేరగానే జనం కంగారుగా పరుగులెత్తడం మొదలుపెట్టారు. ఈ రోజుల్లోలాగా ఆ రోజుల్లో రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లు ఎక్కువలేవు. నాన్న చెప్పిన జాగ్రత్తలు గుర్తుంచుకుని కంగారు పడకుండా తన ట్రంకు పెట్టె ఒక చేత్తో పట్టుకుని, రమణా, రవి తన వెనకాల పరుగుపెడుతుంటే ఎదురుగుండా కనిపించిన జనరల్ కంపార్ట్‌మెంట్‌లో జనాల మధ్య తోసుకుంటూ, తొయ్యబడుతూ అతికష్టమ్మీద ఎక్కింది భవాని. లోపలకు వెళ్లడానికి దారి దొరక్క, కొంచెం పక్కకు తప్పుకుని బాత్రూమ్ దగ్గర ట్రంకుపెట్టె కష్టం మీద ఇరికించి దానిమీద తను కూర్చుని తమ్ముళ్లిద్దరినీ చెరోపక్క కూర్చోబెట్టుకుని నెమ్మది మీద ఎలాగో ఒకలాగ రైలెక్కామన్న ధీమాతో స్థిమితపడింది ఆమె.

ఆ కంపార్ట్‌మెంట్‌లోనే ఎక్కిన విశ్వనాథం నాలుగుపక్కలా చూసి గుమ్మం దగ్గర్నుంచే వాళ్లని చూడగానే ఆపక్కనే చేరిపోయాడు వస్తున్న మనుష్యుల్ని, తప్పించుకుంటూ. భవానికి అతన్ని చూడగానే పై ప్రాణాలు పైనే పోతున్నాయనిపించింది. అతను చాలా చాకచక్యంగా మనుషుల్ని తోసి ఆమెకి ఎదురుగానే తన బ్యాగు పెట్టి దానిమీద కూలబడ్డాడు. ఆమెకి అతని ఊపిరి తగులుతున్నట్లుగా వుంది. చాలా ఉక్కగా ఉంది. గాలి ఎక్కడాలేదు నిండిపోయిన ఆ మనుషులవల్ల. తనకి ఊపిరి ఆడుతున్నట్లు అనిపించడంలేదు. భవాని మనసులో కంగారుగా ఉంది ఈ మనిషెక్కడ దావురించాడ్రా బాబూ అని. రైలు బయలుదేరింది. నిద్రకి, ఆకలికి ఆగలేక పిల్లలిద్దరూ కళ్లు మూస్తూ తెరుస్తూ, ఆవులిస్తూ భవానీ మీదకు వాలిపోతూ అవస్థలు పడుతున్నారు. అదే అదను చూసుకుని విశ్వనాథం మళ్లీ మాట్లాడడం మొదలుపెట్టాడు.

"మీరేమిటి మూగ మల్లెమొగ్గలా కూర్చున్నారు. మీ గురించి మీకు తెలియదులా ఉంది. ఎర్రగులాబీని చూసారా ఎప్పుడయినా? మంచి వయసులో, పదహారేళ్ల అమ్మాయిల్లాగా ఉంటుంది కదూ."

భవానీ మాట్లాడలేదు. భ్రుకుటి ముడిచి తీక్షణంగా చూడడానికి ప్రయ



## శ్రీదేవి పెళ్లి

యువతార శ్రీదేవి త్వరలోనే పెళ్లిచేసుకోబోతున్నదనే వార్త ఫిలింనగర్‌లో జోరుగా వినిపిస్తోంది. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ బిజినెస్ నిర్వహిస్తున్న రాహుల్‌తో శ్రీదేవి పెళ్లి వచ్చే జూన్‌లో జరపడానికి ఇరువైపుల కుటుంబాలూ ఒప్పుకున్నాయిట. పెళ్లిచేసుకున్నాక శ్రీదేవి సినిమాలకు గుడ్‌బై చెప్పే అవకాశాలే ఎక్కువగా వున్నట్టు తెలుస్తోంది. కాబోయే పెళ్లికూతురు శ్రీదేవికి అడ్వాన్స్‌గా శుభాకాంక్షలు చెబుదాం.



త్నించింది మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని.

విశ్వనాథం దగ్గర్నుంచి విపరీతమైన వాసన వస్తోంది. వాసనకంటే కంపు అంటే మంచిదేమో. అది చవకబారు తాగుడు వాసన అని తట్టింది భవానికి. రిక్షావాళ్లు, ట్రక్కు డ్రైవర్లు దగ్గర అదే కంపు వస్తుంది. ముక్కు బద్దలవుతున్నట్లుగా ఉంది. పిల్లల్నిద్దర్నీ పొదవి పట్టుకుని కూర్చుందామె. అతను ఆమెకి చాలా దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఎర్రగులాబీని చూస్తే ఏం చేయాలనిపిస్తోందో మీకు తెలుసా? మీరు నవలేదో చదువుతున్నారు. మీకు తెలిసే ఉండాలి" అన్నాడు విశ్వనాథం.

భవానికి మౌనమే శరణ్యం అనిపించింది. రైలు కుదుపులకి, ముందుకు పడినట్లుగా తూలి ఆమె మీదకు వచ్చి పడ్డాడు విశ్వనాథం. అతని ఒళ్లు తగలగానే కంపరం, చదర, ఎక్కడలేని అసహ్యం. భవానికి అతనిమీద ఎక్కడలేని కోపం తెప్పించాయి. పిల్లలిద్దరూ కూడా ఉలిక్కిపడి నిద్రలేచారు.

భవానీ మరింకేమీ ఆలోచించకుండా హఠాత్తుగా లేచి "ఒరేయ్ రమణా, రవి! పదండ్రా లోపల జాగా ఉందేమో చూద్దాం" అని వాళ్లిద్దర్నీ బరబరా ఈడ్చుకుంటూ మనుష్యుల్ని తోసుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్లు వెళ్లిపోయింది లోపల్లోపలకు పెట్టె అక్కడే వదిలేసి. రెండుమూడు క్యాబిన్లు దాటాక ఒక చోట ఒక పెద్దావిడ పక్కనే కొంచెం జాగా కనిపించగానే పిల్లలిద్దర్నీ అక్కడే కూర్చోబెట్టి తనూ అక్కడే ఇరుక్కుని కూర్చుంది. ఆ పెద్దావిడ కొంచెం జరిగి వాళ్లకి మరికొంచెం జాగా ఇచ్చింది. అప్పటికి స్థిమితంగా అనిపించింది భవానికి. పెట్టె పోతే పోతుందిగానీ తను తప్పించుకోగలిగింది అనుకుంటూ డబ్బు, రైలుటిక్కెట్టు ఉన్న తన పర్సు పదిలంగా పట్టుకుంది.

జనం ఎక్కుతూ దిగుతూనే ఉన్నారు ప్రతి చోటా రైలు ఆగగానే. అది పాసింజర్‌లా వెళ్తోంది. మద్రాసువరకు వెళ్లే రైలు ఆ రోజుల్లో అదొక్కటే. పిల్లలు మళ్లీ నిద్రలోకి జారుకున్నారు. ఎప్పుడు తెల్లవారిందో తెలియలేదు. మళ్లీ విశ్వనాథం కనిపించలేదు. భవానికి ధైర్యమొచ్చింది. భయం లేదనుకుని బాత్రూమ్ వద్దకు వెళ్లి చూస్తే అదృష్టవశాత్తు పెట్టె అక్కడే ఉంది. దీన్ని తీసుకొచ్చి తన దగ్గర పెట్టుకుంది. రాత్రిలోగా హాయిగా ఇంటికి చేరగలమన్న నమ్మకం కలిగింది ఆమెకు. పిల్లలకి పాలు, బిస్కెట్లు కొనిపెట్టి తను కాఫీ తాగింది. ఆ ప్రయాణంలోని ఆ అనుభవం ఒక భయంకరమైన నిజాన్ని తెలిపింది. ఎంత చదువుకుని, ముందుకు వెళ్లాలన్నా, మగవాళ్లతో సమానమనుకున్నా ఒక్కర్తీ ఆడది దొరికితే చాలు ఇలంటి మేకవన్నె పులులు, తోడేళ్లు వెంటపడుతూ వేటాడుతూనే ఉంటాయి.

అది మొదటి అనుభవం కావడంతో ఆమె తర్వాత్తర్వాత జాగ్రత్తగానే మనుష్యుల్ని తెలుసుకోవడం మొదలుపెట్టింది. చదువు పూర్తయి లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఒంటరి ప్రయాణాలు చాలానే చేసింది. కట్నం ఇవ్వనని, ఉద్యోగం వదలనన్న పంతంతో ఆలస్యంగానైనా తనకి తగినవాడు, తనలాగే విశాలభావాలున్నవాడు అయిన కెప్టెన్ శివప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. ఉద్యోగంచేస్తూ తనంతట తాను బ్రతకగలిగి భర్తకి ఫీల్డు పోస్టింగ్ వచ్చినప్పుడు సర్దుకుపోగల మనస్తత్వం, నేర్పు, సమర్థత ఉన్న భవాని తనకి తగిన అమ్మాయే అనుకున్నాడు శివప్రసాద్. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇద్దరివీ వేరే వేరే ఉద్యోగాలు, ప్రదేశాలు కావడంవల్ల భవానికి ఆ ఒంటరి ప్రయాణాలు తప్పలేదు.

## 1980వ సంవత్సరం

అప్పటికి భవానికి ముప్పై ఆరు ఏళ్లు. కానీ ఆమె అలా కనిపించదు, 25-30 ఏళ్ల అమ్మాయిలా వుంటుంది.మూడేళ్ల కూతురు రజని, రెండేళ్ల కొడుకు రామ్‌ను తీసుకుని ఎక్కడో కాశ్మీర్‌లో కొండల మధ్య ఫీల్డు పోస్టింగ్‌లోవున్న మేజర్ శివప్రసాద్ దగ్గరకు బయలుదేరింది ఎండాకాలం సెలవులకి. తనున్న ఊరి దగ్గరే ఒక పల్లెటూరిలో సంవత్సరపు సెలవు తన కుటుంబంలో గడిపి వెనక్కి వెళ్తున్న ఓ ఆర్మీ జవానుని భవానికి సాయంగా పంపించాడు శివప్రసాద్ చంటిపిల్లలతో అన్ని రోజులు ప్రయాణం చేసి ఒక్కర్తీ సాయం లేకుండా రావడం కష్టమని. ఆ జవాను నిరంజన్‌కి ఇరవై ఏళ్లుంటాయేమో. నెమ్మదిగా, సౌమ్యంగా 'మేమ్ సాబ్' అంటూ వినయంగా చెప్పినవన్నీ చేస్తున్నాడు.

ముందొక బస్సులో ప్రయాణం చేసి కొండల్ని దాటి విజయనగరం స్టేషన్‌లో కలకత్తా రైలుని పట్టుకోవాలి భవాని. ఒక కాశ్మీర్ బాస్కెట్‌లో పిల్లలకి పాలడబ్బాలు, సీసాలు, ఫ్లాస్కులు తిండి సామాన్లు, ఒక సూట్‌కేస్, ఎయిర్‌బ్యాగ్‌తో బయల్దేరిందామె. సామాన్లు బస్సులో, రైలులో ఎత్తి పెట్టడంలో సాయంచేసాడు నిరంజన్. కానీ పిల్లల్ని మాత్రం అతనికి అప్పజెప్పలేదు, ఎత్తుకోనీయలేదు. ఆర్మీలో కొందరు జవాన్లు పిల్లలని మచ్చిక చేసు

## దొంగని పట్టిన బామ్మ

72 ఏళ్ల జీన్‌హార్ప్ దారి తప్పిపోతే తనకి దారి చూపిస్తారని ముగ్గురు టీనేజీ అమ్మాయిల్ని తన కారెక్కించుకుందిట. అయితే వాళ్లు కారు దిగినట్టే దిగి ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ని లాక్కుని పారిపోబోయారుట. పాపం ఆ ముగ్గురికీ ఆ ముసలామె ఒకనాటి పరుగుల రాణి అని తెలియదుట. అంత పెద్ద వయస్సులోనూ 18 సంవత్సరాల అమ్మాయిలా ఒక్క పరుగులో వెళ్లి వాళ్లను అందుకుని తన బ్యాగ్‌ను లాక్కుని వాళ్లకు బుద్ధి చెప్పిందిట.


## రెండవసారి వాడని గదులు

క్రీ.పూ.246-210లో చైనా చక్రవర్తి చిన్‌షిహువాంగ్‌టి 10 వేల గదులున్న రాజభవనంలో నివసించేవాడట. ఒకే గదిలో రెండవసారి ఆయన నిద్ర పోలేదుట. గ్రేట్ చైనా గోడను నిర్మించిన చక్రవర్తి ఇతడే. అసలా దేశానికి చైనా అన్న పేరు కూడా అతని పేరునుంచే వచ్చిందంటారు.

## ఒక చేత్తో వయొలిన్ వాద్యం

తన ఫ్రెండ్ ఆస్ట్రియన్ కంపోజర్ పాల్‌విట్ జెనిస్టీన్ మొదటి ప్రపంచ యుద్ధంలో కుడి చేతిని పోగొట్టుకున్నాడని, అతని ప్రతిభకు నివాళిగా 1930లో ప్రఖ్యాత సంగీతకారుడు రావెల్ ఒక గీతాన్ని కేవలం వయొలిన్ మీద ఎడమ చేత్తో వాయించేలా కంపోజ్ చేసాడుట.

-విమలారామం



కుని వాడుకుంటున్నారని వింది ఆమె. ఆ కథలన్నీ విన్నాక ఆమెకి పిల్లల్ని అస్సలు వదలాలనిపించలేదు.కొందరు ఆర్మీ ఆఫీసర్ల భార్యలు తమ పిల్లల్ని జవాన్లమీద వదిలి పార్టీలకు వెళ్లినా తను మాత్రం వెళ్లేదిలేదు ఎంతో అవసరమైతేతప్ప. అసలు ఎవరూ సాయం వద్దందిగానీ భర్త మాటల కాద నలేక ఒప్పుకుందామె.తమని ఫస్ట్ క్లాస్‌లో ఎక్కించి తన థర్డ్‌క్లాస్ నుంచి మధ్య మధ్య వచ్చి మంచినీళ్లు తెచ్చిపెట్టడం, పాలు, టీలు తేవడం వగైరా సాయాలు చేసాడు నిరంజన్.

కలకత్తాలో శివప్రసాద్ స్నేహితుడు మేజర్ భట్టాచార్య స్టేషన్‌కి వచ్చి భవానిని, పిల్లల్ని తన క్వార్టర్స్‌లోకి తీసుకుని వెళ్లాడు నిరంజన్‌ని ఆర్మీ యూనిట్‌కి పంపించి.

మర్నాడే ప్రయాణం. భట్టాచార్య భార్య అరుంధతి, భవానీ, పిల్లల్ని చాలా బాగా చూసుకుంది. వాళ్లబ్బాయి అభిజిత్‌తో పిల్లలు ఆడుకున్నారు. మర్నాడు రిజర్వేషన్ ఉంది కనుక బాధలేదు అనుకున్న భవానికి అనుకోని ఎదురుదెబ్బలా హఠాత్తుగా ఆ రోజు కలకత్తా బంద్ అని రైళ్లన్నీ ఆపేసారు. కలకత్తాలో గొడవలు... రిజర్వేషన్లు అంత త్వరగా దొరకదు. ఒకరోజు పోయినా తన భర్తతో గడిపే సమయం తగ్గిపోతుందని భవాని భయం. ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ దొరక్క మేజర్ భట్టాచార్య మర్నాడు అదే ట్రైన్‌లో కష్టంమీద కిటికీలోంచి సామాన్లు, పిల్లలనీ అందించి జమ్ముకి వెళ్ల డానికి భవానిని ఎక్కించాల్సి వచ్చింది.

మనుష్యులు నిలబడేందుకు కూడా సందులేదు. అది మళ్లీ జనరల్ కంపార్ట్‌మెంట్ కూడాను. నిరంజన్ కూడా అందులోనే ఎక్కాడు. పిల్లలకీ, తనకీ సరిపడా జాగా దొరికింది. మర్నాటికిగానీ వాళ్లు చేరరు. ఉక్కలో, వేడిలో ఆ రష్‌లో అలాగే రోజంతా గడపాల్సి వచ్చింది.అర్ధరాత్రి అయింది. పిల్లలతోపాటు భవానికి కళ్లు మూతలు పడ్తుండేవి. రామ్ ఒళ్లో, రజని ప్రక్కన తనకి ఆనుకుని నిద్రపోతున్నారు. హఠాత్తుగా తన ప్రక్కనే ఎవరో నుంచున్నట్లు అనిపించింది తనకి తగలడానికి ప్రయత్నిస్తూ. తన తొడ మీద పక్కనుంచి రామ్ తల క్రిందుగా చేయి పడగానే భవానికి మెలకువ వచ్చింది. ఏదో షాక్ తగిలినట్లుగా అనిపించి ప్రక్కకి తిరిగి చూడగానే నిరం జన్ కనిపించాడు.

తన ప్రక్కనెవరో ఆవిడ ఏదో స్టేషన్‌లో దిగిపోయినట్లుంది. మెరుపులా నిల్చుందామె రామ్‌ని ఎత్తుకుని, మరో చేత్తో రజనీని పట్టుకుని "యూ బ్లడీ... గెటౌట్'' అని అరిచింది గట్టిగా, కోపంగా. నిరంజన్ బిత్తరపోయి పిల్లిలా ముడుచుకునిపోయి లేచి నిల్చుని ఆమె కళ్లల్లో రక్తపుజీరలు చూసి చల్లగా జారుకున్నాడు బయటకి. జనంలో సంచలనం వచ్చి చూసేసరికి భవాని తన జాగాలో పిల్లల్తో కూర్చుండిపోయింది.

***

మర్నాడు జమ్మూ చేరి దిగిన వేళకి నిరంజన్ కనబడలేదు. శివప్రసాద్‌ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది భవానికి. కన్నీళ్లు రాబో తుంటే ఆపుకుని చేయి వూపిందామె.

"నిరంజన్ ఏడి?'' అంటూ వచ్చాడు శివప్రసాద్.

"వాడక్కర్లేదు. సామాన్లు కూలి వాడి చేత దింపించండి'' అంది భవాని.

అతనొక నిముషం ఆమె కళ్లల్లోకి చూసి ఏదో అర్థమయినట్లుగా లోప లకు వెళ్లి సామాన్లు ఒక్కడే అన్నీ బయటకు తెచ్చేసాడు.

పక్క కంపార్ట్‌మెంట్ నుంచి నిరంజన్ పరుగెత్తుకుంటూ వచ్చి శివప్రసా ద్‌కి శాల్యూట్ చేసాడు.

"ఆప్‌కా జరూరత్ నహీ...'' అన్నాడు మేజర్ శివప్రసాద్ కొంచెం కటు వుగా.

వాళ్లు కార్లో ఆర్మీ ట్రాన్సిట్ కేంప్‌కి వచ్చాక జరిగింది చెప్పి అంది భవాని సజల నయనాలతో "మరెవర్నీ ఎప్పుడూ ఇంక పంపవద్దు. పిల్లలతో ప్రయాణాలు చేసి రావడం నాకలవాటే. వాళ్లింక పెద్దవాళ్లయిపోతున్నారు. నేను ఒక్కర్తినీ రాగలను''

"డోంట్‌వర్రీ... నిరంజన్‌ని నేను చూస్తానులే'' అన్నాడతను. కానీ అత నికి తెలుసు ఆ జవాన్లు కొండల్లో, మంచులో, ఎడార్లలో, ఇసుకలో, వేడిలో నెలల తరబడి పెళ్లాం పిల్లల్ని వదిలి ఎలా బ్రతుకుతారో? అతను నిరంజన్ ప్రవర్తనకి కారణాలు చెప్పదలచుకోలేదు. భవానికి అవేమీ అక్కర్లేదు. ఆ జవాను మగబుద్ధిమీదే కోపం ఉందామెకి.

ఆ రెండో అనుభవం తరువాత కూడా ఆమె ఎన్నోసార్లు పిల్లలతో ఒక్కర్తీ ప్రయాణాలు చేసింది. కానీ మనసులో ఆమెకి ఉండిపోయిందా భావన అలాగే ఈ తోడేళ్ల బారి నుంచి ఆడదానికి విముక్తి లేదు ఎప్పటికీ అని.

## వింత పెళ్లి

ప్రపంచంలో వింతలకు విడ్డూరాలకు కొదవేంలేదు. నమ్మలేని విడ్డూరానికి ప్రత్యక్ష సాక్షులు ఈ ప్రేమికులు. అక్టావియో గుల్లెన్, ఆండ్రియానా మార్టిన్జ్‌లకి ఎంగేజ్‌మెంట్ అయినప్పుడు వాళ్ల వయస్సు 15 సంవత్సరాలు. విచిత్రమేమిటంటే వాళ్ల పెళ్లి మాత్రం వాళ్ల 82వ ఏట జరిగిందిట.


## పాత పుస్తకాలతో రోడ్డు

బర్మింగ్‌హోమ్‌లో మిల్స్‌బూన్ వ్రాసిన 25 లక్షల పాత నవలల కాగితాలతో చేసిన గుజ్జును 2003లో ఒక రోడ్డు పునాదుల క్రింద వాడారుట. ఆ కాగితం గుజ్జుకి వున్న శబ్దగ్రహణ శక్తివల్ల దానిపై వెళ్లే వాహన శబ్ద కాలుష్యం తగ్గిపోయిందిట.

## ప్రపంచంలో పొడవైన బెంచి

జపాన్‌లో మాసుసోగురాలో కర్రతో తయారుచేసిన బెంచి 461 మీటర్ల పొడవు వుంటుంది. దానిపై 1350మంది ఒకేసారి పక్కపక్కన కూర్చుని సూర్యాస్తమయాన్ని ఆనందంగా తిలకించవచ్చునట.

-విమలారామం



## 2000 మిల్లీనియం సంవత్సరం

భవానికి ఇప్పుడు ఏభై ఆరేళ్లు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా మరో రెండేళ్లల్లో రిటైరవుతుంది. బ్రిగేడియర్ శివప్రసాద్ భవానితోపాటే భువనేశ్వర్‌లో బ్యాంక్‌లో ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఉన్నాడు. రజనికి పురిటినొప్పులు దగ్గరపడ్డాయని భవాని ఆ రోజు ఢిల్లీకి బయలుదేరింది. తనకి సెలవు దొరకలేదని, తరువాత వస్తానని ఆమెని రైలెక్కించి వెళ్లిపోయాడు శివప్రసాద్.

ట్రైన్ ఎక్కగానే తను చిన్నప్పుడు ఎక్కిన రైళ్లకి ఇప్పటికీ ఎంతో తేడా అని మనసులో పాత జ్ఞాపకాలన్నీ గుర్తుకువచ్చాయి. వాటితోపాటు ఇప్పటి ఈ నాగరికత...అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా? ఇప్పటి ఈ మొబైల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఎల్‌సిడి టీవీలు, డిజిటల్ కెమెరాలు, హోమ్ థియేటర్లు, కార్లు, ట్రైన్లు, విమానాలు...ఓహ్ ఒకటే ప్రపంచం. గ్లోబలైజేషన్. మనిషి మారాడా మరి? అమ్మా నాన్నా లేరు. తనకి శివప్రసాద్‌కి దగ్గరైన అన్నతమ్ముళ్లు, కుటుంబాలు, అక్కచెల్లెళ్లు, ఎక్కడెక్కడో ఉన్నారీ ప్రపంచంలో తన జీవితంలో ఇంత మార్పు వస్తుందని నలభై ఏళ్ల క్రిందట తను అనుకుందా? కానీ ఆమెకి తెలిసిందల్లా అప్పటికీ ఇప్పటికీ మార్పులేని ఆ తోడేళ్ల గురించే. ఆమెకి మనసులో అనిపించిది ఇప్పుడూ అటువంటి అనుభవం... తనలో తనే నవ్వుకుందామె. తనకిప్పుడు వయస్సులేదు. యాభై ఆరేళ్ల వృద్ధ వనిత తను. కానీ ఆమెకి తట్టనిదల్లా తను అంత వయసున్నదానిలా కనబడదని! ఆమె అందం తరగలేదు. నల్లరంగు కొట్టిన బాబ్డ్ హెయిర్, నల్లని చీరలో తెల్లగా మెరుస్తున్న శరీరం. ఆ బంగారువన్నెకి మెరుపు తెచ్చేట్లుగా మెడలో ముత్యాల హారం, చేతులకి ముత్యాల గాజులు, ఖరీదైన వాచీ. ఆమెని చూస్తే ఇంకా నలభై ఏళ్లు కూడా రాలేదనుకుంటారు ఎవరైనా. చూడముచ్చటగా ఉందామె. ఫస్ట్‌క్లాస్ ఏసి కంపార్ట్‌మెంట్‌లో క్రిందసీటులో హాయిగా వెనక్కి జారబడి ఇంగ్లీషు నవలేదో చదవడం మొదలుపెట్టింది. ఎదుటి సీట్లో వయస్సులోవున్న కొత్త దంపతులు. తన ప్రక్కన చిన్న కుర్రావాడొకడు ఇరవై అయిదేళ్లదాకా ఉంటాయేమో. ఎవర్తోనో అటు ప్రక్కవాళ్లతో మాట్లాడుతూ తన గురించి చెప్పుకుంటే వింది. అతనొక ఐఎఎస్ ఆఫీసర్ అని. తన అల్లుడు వయసన్నమాట.

నీళ్ల బాటిల్, లంచ్, టీ, డిన్నర్ అన్నీ సమయానికి అందిపోయాయి. ఎవరి సీట్లలో వాళ్లు సర్దుకుని పడుకోవడం మొదలుపెట్టారు. చాలాసేపు చదువుకుని ఏ రాత్రి పన్నెండు దాటాకో లైటార్పి పడుకుంది భవాని.

హఠాత్తుగా కాళ్ల దగ్గర ఎవరో కూర్చున్నట్లుగా అనిపించింది. తన పాదాలు తడిమిన ఆ చేతులు మరికొంచెం కాళ్లపైకి రాబోతుంటే గబుక్కున లేచి తన సీటు పక్క లైటు వేసిందామె. ఆమె పై బెర్తుమీద కుర్రవాడు అదిరిపడి లేచి నిల్చున్నాడు. క్రింద సీట్లో ఆమె పక్కనే దగ్గరగా కూర్చున్నాడు.

అతన్ని కోపంగా చూసి అందామె ఇంగ్లీషులో "నిద్ర రావడంలేదా? బైదిబై నేను చెప్పడం మర్చిపోయాను. నువ్వు ఐఎఎస్‌కదూ. మా అల్లుడు నిశ్చల్ కూడా ఢిల్లీ సెంట్రల్ గవర్నమెంట్‌లో ఐఎఎస్ ఆఫీసర్. కూతురు మార్కెటింగ్ మేనేజర్. మా అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నేను కాలేజీ ప్రిన్సిపాల్‌గా వచ్చే సంవత్సరం రిటైరవుతాను. మా అమ్మాయి డెలివరీకి ఢిల్లీ వెళ్తున్నాను. బహుశా మీ అమ్మ నా అంతే ఉంటుందేమో కదూ. పోయి నిద్రపో" ఒక్కసారిగా దెబ్బతిన్నట్లు ఆ కుర్రవాడు మరి మాట్లాడలేక "సారీ" అని పైబెర్తుమీదకి వెళ్లిపోయాడు. ఆమె గొడవ చేయకుండా తనని మందలించి వదిలేసినందుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

డెబ్భై ఏళ్ల వృద్ధ స్త్రీ నుంచి ఉయ్యాలలోని పసికందువరకు ఆడవాళ్లని వదలని ఈ మనుష్యులు మనుష్యులేనా? తోడేళ్లా? ఆమెకి ఎన్నో ఏళ్ళ క్రితం జరిగిన ఇంకో సంఘటన కూడా గుర్తుకువచ్చింది. ఒక లేడీ ఐఎఎస్ ఆఫీసర్, పోలీసు డిజి గురించి. ఏదో తమాషాకి చెయ్యి తగిలించానని తప్పించుకోబోయాడా ప్రబుద్ధుడు. ఇటువంటి విషయాలు వదిలేస్తే చిన్న చీమలు పుట్టలు పాము గుట్టలైనట్లు పెరిగిపోతాయని ఆ లేడీ ఆఫీసరు చివరిదాకా వదలలేదు ఆ పోలీసు వ్యక్తిని. చదువుకున్నవాళ్ల అవస్థ ఇలా వుంటే నిరక్షరాస్యుల సంగతేమిటి?

అప్పుడు భవానికి మళ్లీ మరోసారి అర్థమయిందల్లా ఏది మారినా ఈ గాంధీ పుట్టిన దేశంలో ఏ అర్ధరాత్రి అయినా, పగలైనా, కదిలే కార్లలోగానీ, ట్రైన్లలోగానీ, రోడ్లమీదగానీ మరెక్కడైనా వయస్సుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న ముద్రకి మాత్రం మార్పురాదు. చీర చెంగు తగిల్తే చాలనుకునే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. ఆ చీరలో ఎవరో తెలియకపోయినా సరే 'ఆడది' కూడా ఒక ప్రాణమున్న మనిషే, మరబొమ్మ కాదని గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో మరి? వస్తుందా అసలు?

☆

## ఫలించిన ప్రేమ

1998లో స్టీవ్‌స్మిత్ తన ప్రేయసికి గాఢమైన ప్రేమలేఖ రాసాడు. ఆమె తల్లి ఇవ్వడం మరిచిందో ఏమో పాపం ఆ లేఖని కార్మెన్ రూయిజ్ అందుకోలేదు. పది ఏళ్లు గడిచిపోయాయి. ఇటీవల ఇల్లు రీమోడలింగ్ చేయిద్దామని సామాన్లు సర్దుతుండగా ఫైర్ ప్లేస్ పక్కనున్న పాత కాగితాల్లో ఆనాటి లేఖ కనిపించి ఆమె నిర్ఘాంతపోయిందిట. మొదట బాధపడినా ఉండబట్టలేక అతని అడ్రస్ పట్టుకుని వెళ్లి కలిసింది. చిత్రంగా... అతను కూడా భగ్న హృదయంతో అలాగే ఉండిపోయాడుట. తన ప్రియుడు తనను కాంటాక్ట్ చేయలేదన్న దిగులుతో ఆమె కూడా అవివాహితురాలిగా ఉండిపోయింది. వాళ్లిద్దరూ నిజానిజాలు తెల్సుకుని త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారు.

## దూసుకువస్తున్న గ్రహ శకలం

2004 ఎమ్ఎన్4 అని పిలువబడే గ్రహశకలం భూమికి 13.4.2029వ తేదీన 19 వేల మైళ్ల దగ్గరకు వచ్చేస్తుందిట. కానీ అది భూమిని తాకకుండానే అంతరిక్షంలో మరోవైపుకి దూసుకుపోతుందిట.

## ఈత రాని నావికుడు

కెప్టెన్ కుక్ అనేక ఏళ్లపాటు నౌకాయానం చేసి ప్రపంచాన్ని రెండుసార్లు చుట్టి రావడమే కాకుండా మారుమూల దేశాల్ని కనుగొన్న నావికుడు కూడా. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇతనికి ఈత రాదుట.

**-విమలారామం**

